క్లుప్తంగా

విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ప్రభుత్వ బాలుర కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చుతున్నారు. శబ్దోకి బగియా అనే అంశంపై జాతీయ స్థాయిలో హిందీ కవిత్వ గీతా ప్రకాష్ ఆధ్వర్యంలో పుస్తకాన్ని ప్రచురిస్తున్నారు. ఇందులో 216 మంది కవులు కవిత్వాలు రాయగా.. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర కళాశాల విద్యార్థులు ముగ్గురికి కవిత్వం రాసేందుకు చోటు దక్కింది. ఈసందర్భంగా బుధవారం ప్రిన్సిపాల్ విఠల్, లెక్చరర్లు నాగోరావులు ఆ విద్యార్థులను అభినందించారు. అమన్ అనే విద్యార్థి బాల్యం గురించి, సూర్య వంశీ అనే విద్యార్థి దేశభక్తి గురించి, సందేశ్ అనే విద్యార్థి ప్రేరణ, ఆత్మవిశ్వాసం గురించి కవిత్వాలు రాశారు.

భీం విగ్రహ ఏర్పాటుకు సహకరించాలి



చందా సేకరిస్తున్న ఆదివాసీ పెద్దలు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న కుమురం భీం విగ్రహం ఏర్పాటుకు ఆదివాసీలు సహకరించాలని ఆదివాసీ పెద్దలు కోట్నాక్ భారిక్‌రావ్, హేరేకుమ్ర జంగు పటేళ్లు కోరారు. బుధవారం గిన్నేర రాయిసెంటర్ పరిధిలోని గ్రామాల్లో చందా వసూలు చేశారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాడినా.. కుమురం భీం విగ్రహం ఏర్పాటు పనులు పూర్తి దశకు చేరుకున్నాయన్నారు. త్వరలో విగ్రహం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆదివాసీలు తుమ్రం మారుతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు బూత్ లెవెల్ ఏజెంట్లతో సమావేశం

బోథ్: మండల కేంద్రంలోని పరిచయ గార్డెన్‌లో గురువారం కాంగ్రెస్ నియోజకవర్గస్థాయి బూత్ లెవల్ ఏజెంట్లతో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ అభ్యర్థి ఆడె గజేందర్ తెలిపారు. కార్యక్రమానికి అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు, జెడ్పీటీసీలు హాజరు కావాలననారు.

సెల్‌ఫోన్ అందజేత

బోథ్: మండల కేంద్రానికి చెందిన కుమార్ తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. కాగా సొనాలకు చెందిన శుద్ధోధన్, శ్రీధర్‌లు బోథ్ నుంచి సొనాలకు వెళ్తుండగా బోథ్‌ను ఆనుకుని ఉన్న వంతెనపై వారికి సెల్‌ఫోన్ దొరికింది. ఫోన్‌ను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించేందుకు వెళ్తుండగా.. కుమార్ తన ఫోన్ కోసం వెతుకుతున్నట్లు గమనించి, ఆయనకు ఫోన్ అప్పగించారు.

సన్మానం

సిరికొండ: మండలంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల రాయిగూడ ఆంగ్ల ఉపాధ్యాయుడు మూగ శ్రీనివాస్ ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైనా సందర్భంగా బుధవారం ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యయుడు విజయ ప్రకాశ్ మాట్లాడుతూ.. గిరిజన శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు జిల్లా ఎస్టీయు అధ్యక్షుడిగా ఎన్నికవడం గర్వకారణమన్నారు.

'విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి'

ఖానాపూర్: విద్యుత్ వినియోగదారులకు ఇబ్బందులు రాకుండా ఎప్పటికప్పుడు వారి సమస్యలు పరిష్కరించాలని డీఈ నాగరాజు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో బుధవారం ఖానాపూర్, కడెం, మామడ, పెంబి, దస్తురాబాద్ మండలాల విద్యుత్ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. సంస్థ అంతర్గత సామర్థ్యంతోపాటు రెవెన్యూ వసూళ్లను పెంచాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యాలు తగ్గేలా దృష్టి సారించి బకాయిల వసూళ్లను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఏవో సుదర్శన్, టెక్నికల్ డీఈ రత్నకుమారి ఏడీఈ కౌట్టి శ్రీనివాస్ ఉన్నారు.

'బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలం'

ఖానాపూర్: రైతుల సమస్యలు పరిష్కరించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని రైతు సంఘం నిర్మల్ డివిజన్ కార్యదర్శి గణేశ్, ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి పీటర్ అన్నారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించి వారు మాట్లాడారు. తొమ్మిదేళ్ల ఏళ్ల పాలనలో సీఎం కేసీఆర్.. రైతులకు చేసింది శూన్యమన్నారు. కనీసం పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని విమర్శించారు. ఖానాపూర్ మండలంలో నిర్మించాల్సిన సదర్మాట్ బ్యారేజీని మంత్రి ఐకేరెడ్డి తన నియోజకవర్గంలోని మామడ మండలానికి తరలించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి సురేందర్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి స్వరూప, నిర్మల్ పట్టణ కార్యదర్శి హైమద్ తదితరులు ఉన్నారు.

పత్తి కొనుగోళ్లు జరిగేనా?

- ప్రైవేట్ జిన్నింగ్‌లోనే పత్తి కొనుగోళ్లు
- అలంకారప్రాయంగా బోథ్ మార్కెట్ యార్డు
- పట్టించుకోని అధికారులు



అలంకారప్రాయంగా బోథ్ మార్కెట్‌యార్డు

బోథ్: పత్తి కొనుగోళ్ల నిబంధనల ప్రకారం ఆయా మార్కెట్ యార్డుల్లో చేపట్టాలి. మార్కెట్ యార్డులోనే తూకం వేయాలి. అయితే గత కొన్నేళ్లుగా బోథ్ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లు జరగడం లేదు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రైవేట్ జిన్నింగ్ మిల్లుల్లోనే తూకం వేస్తున్నారు. దీంతో వ్యాపారస్తులు తేమ పేరుతో కటింగ్ పెట్టడడంతో రైతులు నష్టపోతున్నారు. వాస్తవానికి రైతులు మార్కెట్‌యార్డుకు తెచ్చిన పత్తిని కొనుగోలు చేయడానికి వ్యాపారులు మార్కెట్ యార్డులోనే ధరను నిర్ణయించి, తమ జిన్నింగ్ మిల్లులకు తరలించాలి. కానీ బోథ్ మార్కెట్ యార్డు పరిధిలో గత కొన్నేళ్లుగా కొనుగోళ్లు అందుకు భిన్నంగా జరుగుతున్నాయి. దీనివల్ల పత్తికి మద్దతు ధర లభించక రైతులు నష్టపోతున్నారు. పత్తిని మార్కెట్ యార్డుకు తీసుకువస్తే వ్యాపారులు పోటీ పడి పత్తి కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. అలాగే రైతులు అధిక ధర పొందవచ్చు. తమ సొంత జిన్నింగ్‌మిల్లుల్లో కొనుగోళ్లు జరపడం వల్ల రైతులకు మద్దతు ధర లభించడం లేదు.

తూకం సరిగా జరిగేనా?

మార్కెట్‌యార్డులో కొనుగోళ్లు జరగకపోవడంతో రైతులు నేరుగా ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులకు తమ పత్తిని తీసుకువస్తున్నారు. కాంటాల్లో పత్తిని తూకం వేస్తున్నారు. ఎలాగూ జిన్నింగ్ మిల్లు యజమానులకే అమ్మాల్సిన పరిస్థితి నెలకొంది. పత్తిని జిన్నింగ్ మిల్లులో ఖాళీ చేసిన తరువాత ధరను నిర్ణయించడంతో రైతులు ఏం చేయలేని పరిస్థితి. మార్కెట్ యార్డులో కొనుగోళ్లు జరిగితే వ్యాపారస్తులు పోటీ పడి ధరను పెంచి పత్తిని కొనే అవకాశం ఉంటుంది. వాస్తవానికి కాంటాలు సరిగా పనిచేస్తున్నాయా? లేదా అనే విషయాన్ని వ్యవసాయ కమిటీ అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో కొన్ని జిన్నింగ్ మిల్లుల్లో తూకంలో తేడా వచ్చిన సందర్భాలు ఉన్నాయి.

గతంలో మార్కెట్ యార్డులో కొనుగోళ్లు..

గతంలో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా అహ్మద్ బాబు ఉన్నప్పుడు బోథ్ మార్కెట్‌యార్డులో పత్తి కొనుగోళ్లు జోరుగా సాగాయి. వ్యాపారస్తులు పోటీ పడి పత్తి కొన్నారు. దీంతో రైతుల లాభపడ్డారు. అహ్మద్ బాబు కలెక్టర్‌గా బదిలీ అయినప్పటి నుంచి మళ్లీ ప్రైవేట్ జిన్నింగ్‌లోనే కొనుగోళ్లు జరుగుతున్నాయి. బోథ్ మార్కెట్ యార్డులో కొనుగోళ్లకు అవకాశం ఉన్నా.. అధికారులు మాత్రం పట్టించుకోడం లేదు. కాంటాలు సరిచేయడం, కొనుగోళ్లకు సంబంధించి ఏర్పాటు చేయడం వంటివి కనిపించడం లేదు. కొనుగోళ్లకు సంబంధించి ఎలాంటి ప్రకటనలు ఇప్పటివరకు చేయలేదు. ఈసారి కూడా ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులోనే పత్తి కొనుగోలు చేసేలా అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

మార్కెట్‌లోనే కొనుగోలు చేయాలి



బోథ్ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లు జరపకపోవడం వల్ల రైతులకు అన్యాయం జరుగుతోంది. మార్కెట్‌లోకి రైతులు తీసుకువచ్చిన పత్తిని వ్యాపారస్తులు పోటీ పడి ధరలు పెంచి కొనుగోలు చేస్తారు. కానీ ప్రైవేట్ జిన్నింగ్‌ల్లో కొనుగోలు చేయడం వల్ల రైతులకు మద్దతు ధర దక్కే అవకాశం ఉండదు. కావున మార్కెట్ యార్డులోనే పత్తి కొనుగోళ్లు జరపాలి.

– సంగెపు బొర్రన్న, రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

- ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి రామన్న



తల్లిదండ్రుల చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

జైనథ్: రాష్ట్రంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం మండలంలోని నిరాల గ్రామంలో రోడ్ షో నిర్వహించారు. సర్పంచ్ సునందా ప్రభాకర్ క్రేన్ సహాయంతో భారీ గజమాల వేశారు. అనంతరం ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను బీఆర్‌ఎస్ అమలు చేస్తోందన్నారు. అధికారంలోకి వస్తే మహిళలకు రూ. 3వేల జీవన భృతి, అందరికీ రూ. 5లక్షల బీమా, రూ. 400లకే గ్యాస్ సిలిండర్, రైతు బంధు, పెన్షన్ల పెంపు వంటి పథకాలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, సర్పన్ లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చిత్రపటాలకు పూజలు..

ఎమ్మెల్యే జోగు రామ్నన నామినేషన్ వేయడానికి ముందు తన స్వగ్రామమైన దీపాయిగూడ వెళ్లి, తల్లిదండ్రుల చిత్రపటాలకు పూజలు చేశారు. గ్రామంలోని రామాలయంలో, ఆంజనేయుని విగ్రహం వద్ద సైతం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆదిలాబాద్ వెళ్లి నామినేషన్ దాఖలు చేసారు.

అసమర్థ పాలనకు కర్ణాటకే నిదర్శనం

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ అసమర్థ పాలనకు కర్ణాటకే రాష్ట్రమే నిదర్శనమని ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పలువురు మహిళలు బీఆర్‌ఎస్ చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ కల్లిబొల్లి మాటలను ప్రజలు నమ్మవద్దన్నారు. ఓటుకు నోటు దొంగగా మారిన రేవంత్ రెడ్డి టికెట్లు అమ్ముకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు బండారి సతీష్, లింగారెడ్డి, శివకుమార్, ధమ్మపాల్, నర్సింగ్‌రావు, గణేష్, సంజయ్ పాల్గొన్నారు.

పన్నుల వసూలు ముమ్మరం

- ఇంటి పన్ను 72 శాతం పూర్తి
- వృత్తి వ్యాపార, ఇతరత్ర 48 శాతం పూర్తి
- ఈ నెలాఖరులోపు వంద శాతం పూర్తికి ఆదేశాలు



బేలలో పన్ను రశీదు అందిస్తున్న ఎంపీవో సుమీర్‌హైమద్

బేల: 2023– 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో పన్నుల వసూలును గత 15 రోజులుగా ముమ్మరం చేస్తున్నారు. ఈనెల 4వరకు మండలం మొత్తం ఇంటి పన్నుల వసూలు 72 శాతం పూర్తయింది. అలాగే వృతి వ్యాపారం లైసెన్స్, వారసంత, పశువుల సంత పన్నుల వసూలు 48 శాతం పూర్తి చేశారు. ఈక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి నుంచి గ్రామ పంచాయతీలకు ఈ నెలాఖరులోపు వంద శాతం పన్నుల వసూలుకు ఆదేశాలు జారీ అయ్యాయి.

37 గ్రామ పంచాయతీ పరిధిలో..

మండలంలో మొత్తంగా 37 గ్రామ పంచాయతీలున్నాయి. ఇందులో మైదాన ప్రాంతంలో 12, ఏజెన్సీ ప్రాంతంలో 25 ఉన్నాయి. ఈ పరిధిలో పన్నులు మొత్తం రూ. 35,63,540 ఉన్నాయి. ఇందులో నివాస గృహాలు, ఇతరత్ర భవనాల పన్నుల పాత బకాయిలు రూ. 1,17,915 ఉండగా.. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం రూ.34,45,625లుగా ఉంది. దీంతో పాటు వృత్తి వ్యాపారం లైసెన్స్, వారసంత, పశువుల సంత పన్నులు మొత్తం రూ.12 లక్షల వరకు ఉంటుంది.

వసూలు కావాల్సింది 28శాతం..

ప్రతి ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటి పన్నులు, ఇతర పన్నుల వసూలు మొత్తం మార్చి నెల ముగింపుకు లెక్కిస్తారు. ప్రతిఏటా రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం నూతన ఆర్థిక సంవత్సరం తాలుకు ఏప్రిల్‌లో పన్నుల వసూలుకు డిమాండ్ నిర్ణయిస్తారు. వసూలు కానీ పాత బకాయిలు, ప్రస్తుత డిమాండ్‌తో ఈపన్నుల వసూలుకు కలిపి టార్గెట్‌గా నిర్దేశిస్తారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో ఏప్రిల్ నెల నుంచే పన్నుల వసూలు చేపడుతారు. గత అక్టోబర్ నెల నుంచి పన్నుల వసూలు మమ్మరం చేశారు. మొత్తంగా రూ. 35,63,540 ఉండగా.. ఈనెల 4వరకు రూ. 25,82,924 (72శాతం) వసూలు అయింది. మిగతా రూ.9,80, 616 వసూలు కావాల్సి ఉంది. దీంతో పాటు వృత్తి వ్యాపారం లైసెన్స్, వారసంత, పశువుల సంత, ఇతర పన్నులు మొత్తంగా రూ.12లక్షల వరకు ఉండగా.. రూ. 5.75లక్షలు(48శాతం) వసూలైంది.

అధికారుల ఆదేశాలు..

2023– 24 ఆర్థిక సంవత్సరానికి వంద శాతం పన్నుల వసూలు ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి నుంచి గ్రామ పంచాయతీలకు ఇటీవల ఆదేశాలు జారీ అయ్యా యి. మండలంలోని జూనోని, పోహర్, భవానీగూడ(సి) గ్రామ పంచాయతీల్లో వంద శాతం పన్నుల వసూలు ఇప్పటికే పూర్తయింది. బేలలో 63శాతం పూర్తయింది. దీంతో పాటు సోన్‌కాస్, వరూర్, పిఠగావ్ (ఎల్), మశాల(కె), మణియార్‌పూర్, కాప్సి (బి), ఖార, పోనాల గ్రామ పంచాయతీల్లో 90పై పూర్తయింది. అత్యల్పంగా కొబ్బాయి 51, చంపెల్లి 54, చప్రాలలో 55 శాతం పన్నుల వసూలు పూర్తయ్యాయి. మిగతా 22 గ్రామ పంచాయతీల్లో 60 నుంచి 90 శాతం వరకు పన్ను వసూలు పూర్తి చేశారు.

ఘాటెక్కిన ఉల్లి



ఉల్లిపాయలు

- కిలో రూ.80కి చేరువ
- కన్నీళ్లు పెట్టిస్తున్న ధర
- సామాన్యుల బెంబేలు

కైలాస్‌నగర్: మార్కెట్‌లో ఉల్లి ధర ఘాటెక్కింది. సామాన్యుడిని కంటతడి పెట్టిస్తుంది. దసరా పండగ వరకు కిలో రూ.30 వరకు ఉండగా.. ప్రస్తుతం హోల్‌సెల్‌లోనే రూ.55 నుంచి రూ.60 పలుకుతుంది. ఇక రిటైలుగా అయితే రూ.70నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారు. దీంతో సామాన్యులు బెంబేలుత్తుతున్నారు. డిమాండ్‌కు సరిపడా సరఫరా లేక పోవడంతోనే మార్కెట్‌లో ఉల్లి ధరకు రెక్కలొచ్చినట్లుగా వ్యాపారులు చెబుతున్నారు. మరో రెండు నెలల వరకు ఇదే పరిస్థితి ఉంటుందని, ధర మరింత పెరిగవచ్చని అంటున్నారు. ఇదే అదునుగా కొంత మంది వ్యాపారులు నాసిరకం సరుకును సైతం అధిక ధరకు విక్రయిస్తున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

ఆదిలాబాద్ జిల్లాకు ఉల్లిగడ్డ మహారాష్ట్రలోని నాందేడ్, షోలాపూర్‌తో పాటు మన రాష్ట్రంలోని హైదరాబాద్ నుంచి ఎక్కువగా దిగుమతి అవుతుంది. జిల్లా కేంద్రంలో 10 హోల్‌సెల్ షాపులు ఉండగా వీటి పరిధిలో వారానికి వెయ్యి క్వింటాళ్ల విక్రయాలు జరుగుతాయి. అలాగే ఇచ్చోడలో మూడు హోల్‌సెల్ షాప్‌లు ఉండగా వీటి పరిధిలో వారానికి 300 క్వింటాళ్ల వరకు విక్రయాలు ఉంటాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. జిల్లా అంతటికి ఈ రెండు ప్రాంతాల నుంచే ఉల్లి సరఫరా అవుతుంది. ప్రస్తుతం హోల్‌సెల్‌లో క్వింటాల్ రూ.4వేల నుంచి 5వేల ధర పలుకుతుంది. అయితే కొంతమంది వ్యాపారులు సరుకు సరిపడా రావడం లేదనే సాకుతో నాసిరకం సరుకును కూడా అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఇక రిటైల్‌గా రూ.70 నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారు. జనవరిలో వరకు ఇదే పరిస్థితి ఉంటుందని మార్కెట్ వర్గాలు చెబతున్నాయి.

సామాన్యులపై భారం

ఉల్లి ధర క్రమంగా రూ.వందకు చేరువవుతుండడం సామాన్యులను ఆందోళనకు గురిచేస్తుంది. మొన్నటి వరకు కిలో రూ.30 పలికిన ధర ప్రస్తుతం ఏకంగా 80కి చేరడంతో వారికి భారంగా మారుతుంది. దీంతో ఐదు, పది కిలోలు కొనుగోలు చేసే వారు ప్రస్తుతం ఒకటి, రెండు కిలోలకే పరిమితమవుతున్నారు. ఉల్లి ధరను నియంత్రించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అప్పటి వరకు సబ్సిడీపై సరఫరా చేయాలని పేదలు కోరుతున్నారు.

జనవరి దాకా ఇదే పరిస్థితి



జిల్లాకు మహారాష్ట్రలోని మన్మడ్, నాసిక్, జల్‌గావ్, ఔరంగబాద్, షోలాపూర్, నాందేడ్, హైదరాబాద్ ప్రాంతాల నుంచి ఉల్లి దిగుమతి అవుతుంది. అయితే ప్రస్తుతం నాందేడ్, షోలాపూర్, హైదరాబాద్ నుంచి మాత్రమే సరఫరా అవుతుంది. దీంతో సరిపడా దిగుమతి లేక ధర పెరుగుతుంది. కొత్త స్టాక్ దిగుబడి వచ్చే జనవరి వరకు ఇదే పరిస్థితి ఉంటుంది.

– అబ్దుల్ సమద్, హోల్‌సెల్ వ్యాపారి

'బండి' సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఇంద్రవెల్లి: జన్నారం మండలంలో గురువారం నిర్వహించే బీజేపీ సభను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ ఆర్క పుష్పలత కోరారు. బుధవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మాట్లాడారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ముఖ్య అతిథిగా వస్తున్నట్లు తెలిపారు. సభకు అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆరెల్లి రాజలింగు, మరప రాజు, కేంద్రే శక్తి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధిహామీ గ్రామసభలు

- మండలంలో ఐదు రోజుల పాటు కొనసాగిన వైనం
- 2022- 23లో రూ. 5.42 కోట్ల పనులు



పనులను పరిశీలిస్తున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఉద్యోగులు

ఆదిలాబాద్‌రూరల్: 2022– 23 ఆర్థిక సంవత్సరంలో మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులపై చేపట్టిన ఇన్ హౌజ్ గ్రామసభలు రెండు రోజుల కిందట ముగిశాయి. క్షేత్రస్థాయిలో ఆయా గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలు, కొలతలను బ్లాక్ రిసోర్స్ పర్సన్ (బీఆర్‌పీలు) పరిశీలించారు. ఇదిలా ఉండగా.. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మొత్తం 34 గ్రామ పంచాయతీల్లో 11,260 జాబ్‌కార్డులు ఉండగా.. యాక్టివ్ జాబ్ కార్డులు 8,296 ఉన్నాయి. అందులో 23,056 కూలీలు ఉన్నారు. ఇందులో రోజు 15,825 మంది కూలీలు పనికి వెళ్లే వారు ఉన్నారు.

రూ. 5.42 కోట్ల పనులు..

2022– 23 ఆర్థిక సంవత్సరంలో మండలంలో రూ. 7.75 కోట్ల పనులు చేపట్టాలని లక్ష్యం పెట్టుకున్నారు. అయితే ఇందులో రూ. 5.42 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. రూ. 3.81 కోట్లు కూలీలకు చెల్లించగా.. మిగితా రూ. 1.61 కోట్లు మెటీరియల్ కింద ఖర్చు చేశారు. వీటికి సంబంధించిన వివరాలను నమోదు చేసుకునేందుకు ఐదు రోజుల పాటు గ్రామస్థాయిలో బీఆర్‌పీలు ఎన్నికల కోడ్ అమలు ఉండడంతో ఇన్ హౌజ్ గ్రామ సభలు నిర్వహించి వివరాలు సేకరించారు. కూలీల, మెటీరియల్ డబ్బులు అందయా? లేదా? అనే విషయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేశారు. ఆ వివరాలను డీఆర్‌పీలు డీఆర్‌డీఏ కార్యాలయానికి పంపిణీనట్లు సంబంధిత ఎన్‌ఆర్‌ఈజీఎస్ మండల అధికారులు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం మండలస్థాయిలో ఆడిట్ నిర్వహించి వివరాలను వెల్లడించనున్నట్లు పేర్కొంటున్నారు.

అక్రమాలు బయటకు వచ్చేనా?

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో కొన్ని గ్రామాల్లో కూలీలకు డబ్బులు అందలేదని, కొన్నిచోట్ల పూర్తిస్థాయిలో పనులు జరగకున్నా జరిగిన్నట్లు రికార్డుల్లో నమోదు చేశారని క్షేత్రస్థాయి బీఆర్‌పీల పరిశీలనలో తెలినట్లు తెలిసింది. మండలంలో ఎంత వరకు అక్రమాలు జరగాయో పూర్తి స్థాయి ఆడిట్‌లో తెలియనుంది.

త్వరలో వివరాలు వెల్లడిస్తాం..

మండలంలోని 2022–23 ఆర్థిక సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను బీఆర్‌పీలు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇన్ హౌజ్ గ్రామసభలు నిర్వహించారు. సేకరించిన వివరాలను డీఆర్‌డీఏకు సమర్పించాం. ఎన్నికల కోడ్ ముగిసి అనంతరం మండలస్థాయి సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడిస్తాం.

– జాకీర్ హుస్సేన్, ఏపీవో, ఎన్‌ఆర్‌ఈజీఎస్

గుంజాలలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాంసి: భీంపూర్ మండలంలోని గుంజాల గ్రామంలో బుధవారం భీంపూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. భీంపూర్ వైద్యాధికారి నిఖిల్‌రాజ్ వైద్య సిబ్బందితో కలిసి గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. దగ్గు, జ్వరంతో పాటు ఇతర సీజనల్ వ్యాధులతో బాధపడుతునన వారిని గుర్తించి మందులు పంపిణీ చేశారు. మొత్తం 46 మందికి వైద్య పరీక్షలతో పాటు రక్తపరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, హెల్త్ అసిస్టెంట్ విష్ణు, ఏఎన్‌ఎం లచ్చుబాయి, ఆశ కార్యకర్తలు సంతోషిని, మీరా, కమల పాల్గొన్నారు.

బీఫాం అందుకున్న సునీల్



బీ ఫాం అందుకుంటున్న సునీల్

గుడిహత్నూర్: మండల కేంద్రానికి చెందిన ఆడే సునీల్ భారత చైతన్య యువజన పార్టీ బోథ్ నియోజవర్గ అభ్యర్థిగా టికెట్ అందుకున్నాడు. ఈమేరకు జాతీయ అధ్యక్షుడు బి.రామచంద్ర యాదవ్ నుంచి హైదరాబాద్‌లో బీ ఫారం అందుకున్నారు. ఆడే సునీల్ గతంలో తెలంగాణ జన సమితి పార్టీలో పని చేశారు. ఈసారి పార్టీ ఎన్నికల బరిలో లేకపోవడంతో బీసీవైలో చేరినట్లు పేర్కొన్నారు. ఎన్నికల బరిలో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

యాగం చేసిన సోయం బాపూరావు



యాగం చేస్తున్న సోయం బాపూరావు

ఇచ్చోడ: బోథ్ నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావు యాగం చేశారు. బుధవారం ఆదిలాబాద్‌లోని తన స్వగృహంలో రాజశ్యామల యాగం చేశారు. గురువారం నామినేషన్ దాఖలు చేయనున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.గెలుపు కోసమే యాగం చేసినట్లు నియోజకవర్గంలో జోరుగా చర్చ జరుగుతోంది.